# ప్లీజ్... ఒక్క కథ...

వెరైటీలో తమకు తామే సాటి అనిపించుకునే వారపత్రిక 'మట్టిబుఱ్ఱ'లో ఏడుపుగొట్టు కథల పోటీకి రచనలను ఆహ్వానిస్తూ ప్రకటన ఇచ్చారు. అది చూడగానే గంగాధరానికి ఆశ కలిగింది. ముందొకసారి ఇలాంటి తమాషా పోటీలోనే పాల్గొనడం జరిగింది. కంటితుడుపు (కన్సొలేషన్) బహుమతి వచ్చింది. ఆమాత్రానికే స్నేహితులందరూ గంగాధ



రాన్ని మెచ్చుకుని, ఆకాశానికెత్తేసారు. ఖర్చు భరించేవాడు లేకపోయాడు గానీ ఉండి ఉంటే సన్మానం కూడా చేసేవారే. మనిషిని చూడగానే మొహం చిట్లించే బాసు కూడా ఇప్పుడు గంగాధరాన్ని చూసి స్మైల్ చేయసాగాడు. బహుమతిగా వచ్చిన డబ్బు స్వల్పమే కానీ నలుగురిలో గంగాధరానికి పరపతి మాత్రం కొండలా పెరిగిపోయింది. అందుకే ఈసారి కూడా ప్రయత్నించుదామనుకున్నాడు.

ఆదివారం ఉదయం కాఫీ టిఫిన్లు ముగించుకుని, కట్టకాగితాలు - అరడజను పెన్నులూ పెట్టుకున్నాడు. డైరెక్టర్లకు సూచనగా బారెడు గడ్డాలు, సైంటిస్టులకు సూచనగా పిల్లిగడ్డాలున్నట్టు - రచయితకు వేళ్ళ మధ్య సిగరెట్టు పెట్టుకున్నాడు. తెల్లని కాగితాలను పెన్నుతో అలికి నలుపు చేస్తున్నాడన్న మాటేగానీ కథకు ఒక అంశం అంటూ మొదలుపెడితే అదే వ్రాసుకుంటూ పోతుందనే ధీమాతో వ్రాయడం మొదలు పెట్టాడు. శ్రీమతి భోజనానికి పిలిచేటప్పటికి అరడజను కాగితాలు ఖర్చయిపోయాయి కానీ కథ ప్రారంభం కాలేదు.

భార్యని చూడగానే పోయినసారి కథను భార్యచేత వ్రాయించిన సంగతి గుర్తుకు వచ్చింది. తీరా బహుమతి వచ్చాక ఈమాత్రం నేను వ్రాయలేనా అనే అహంకారం కలిగింది. కానీ ఇవేళ ఎంత ప్రయత్నించినా ఒక్క అక్షరం కూడా కుదరక పోయేటప్పటికి భార్యే శరణం అనుకున్నాడు.

పండక్కి చీర కొనలేదనే కోపంతో రెండు రోజుల నుంచి అలకసాగిస్తున్న కావేరి వంట మీద ఏమాత్రం శ్రద్ధ లేకుండా చేసింది. వంట ముగించాక రుచులు చూసి, ఈవేళ రావణయుద్ధం తప్పదనుకుంది. కానీ భర్త కిమ్మనకుండా తినడం చూసి ఆశ్చర్యంతో కళ్ళుపెద్దవి చేసి చూసింది.

పప్పుచారు నీళ్ళలా రుచీ-పచీ లేదు. దొండకాయ మగ్గనేలేదు. కొబ్బరి పచ్చడి ఉప్పు కసిం అయింది. "ఏం వంట ఇలా తగలడింది?... ఒళ్ళు దగ్గిర లేదా?" అంటూ ఇంటికప్పు ఎగిరేలా రంకెలు వేసేవాడు. కానీ ఈవేళ అవసరం తనది. అంచేత కళ్ళుమూసుకుని తిన్నాడు గంగాధరం.

"ఈ రంగు నీకు చాలా బాగుంది సుమా... సందర్భం లేకుండానే అన్నాడు గంగాధరం. కావాలనే ఆరోజున వెలిసిపోయి, అరిగిపోయిన పాతచీర కట్టుకుంది కావేరి. అలాంటి చీరని చూసి ఇలా అన్నాడంటే అది పొగిడినట్టా... వెక్కిరించినట్టా...? సందేహంగా చూసింది కావేరి.

"ఈవేళెందుకో చాలా ఫెయిర్‌గా కనిపిస్తున్నావోయ్!" అన్నాడు. ఎంత చక్కగా అలంకరించుకున్నా సరే... "ఎట్టా తోలయినా సరే... ఏడుపుగొట్టు ముఖం వద్దు... నల్లగున్నా నవ్వుముఖం అమ్మాయిని చూడమ్మా... అని చెప్పాను అమ్మతో. అమ్మ నీతెల్లతోలు చూసి మురిసిపోయి చేసింది నాకు" అంటూ విసుక్కునే మనిషి నోటివెంట ఇంత చక్కని మాటా...? విస్తుపోయింది కావేరి.

సాయంకాలం సినిమాకు వెళదాం రమ్మన్నాడు. టీవీలో మంచి సినిమా ఉంది - నేను రానంది కావేరి. టీ తాగి అలా బయటకు వెళ్ళి వేడి వేడి పకోడీలు పట్టుకొచ్చాడు. భర్తలో ఈ మార్పేమిటో అర్థంగాక ఆలోచిస్తూనే సాయం

కాలం పనులు ముగించింది. పెందలాడే పడుకున్నాడు. "కావూ..." భార్యను అతి నాజూకుగా పిలిచాడు గంగాధరం.

ఎప్పుడూ కస్సూ బుస్సూ అనే భర్త అంత ప్రేమగా పిలుస్తుంటే సప్తసముద్రాలు మునిగి ఉంటాయి. ఏ దేశంలోనో భూమి బద్దలయి ఉంటుంది. అసలే ఈమధ్య సునామీలు ఎక్కువగా వస్తున్నాయి అనుకుంది కావేరి.

"కావేరీ..." మళ్ళీ పిలిచాడు గంగాధరం

"అబ్బా... ఏమిటండీ...?" నిద్రమత్తు నటిస్తూ అడిగింది.

"మళ్ళీ నీ బుఱ్ఱకి పని పడిందోయ్. వార పత్రిక "మట్టిబుఱ్ఱ"లో ఏడుపుగొట్టు కథల పోటీ ప్రకటించారు. ఏదైనా ఒక కథ చెప్పు రాసేద్దాం" అన్నాడు చాలా కలివిడిగా.

ఓహో! ఉదయం నుంచీ అయ్యగారు కాగితాలతో చేస్తున్న కుస్తీ ఇదన్నమాట. కథ కుదరలేదు. నన్ను కాకాపడుతున్నాడు. కాస్త బెట్టు చేయాలి అనుకుంది.

గంగాధరం సహజంగా అహంభావి. కానీ తనకవసరం వచ్చినపుడు తన పని జరుపుకోవడానికి పని ముగిసేదాకా కాకా పడతాడు.

కావేరికి పెళ్ళయి ఏడాది గడిచింది. పెళ్ళి చూపులపుడు కావేరి చిన్నపాటి రచయిత్రి అని తెలియగానే మనసులో సంతోషించినా, పైకి మాత్రం అదేం పెద్ద ఘనకార్యంలే అన్నట్టు పెదవి విరిచాడు గంగాధరం.

పెళ్ళయినాక కథలు రాయడానికి మూడ్ లేకుండా పోయింది కావేరికి. ఒకరోజు ఆఫీసు నుంచి వస్తూ, చేతిలో ఉన్న పుస్తకాన్ని కావేరి ఒడిలోకి విసురుతూ, 'చూడు! అందులో కథల పోటీ ప్రకటన ఉంది చూసి ఒక కథ రాసి పడెయ్. మొదటి, రెండు, మూడు కాకపోయినా కంటి తుడుపు బహుమతి వస్తే చాల్లే, వ్యవధి కూడా అట్టే లేదు. త్వరగా రాసెయ్' అన్నాడు.

కథలు వ్రాయడం అంటే కాయగూరలు కొన్నంత తేలికని అతని ఉద్దేశ్యం. కథలు వ్రాయడంలో సహజంగా తనకున్న ఆసక్తిని చంపుకోలేక వచ్చిన అవకాశాన్ని వదలకుండా కథ రాసింది కావేరి.

కథ ఎలాగూ రాసేసింది కదా... ఇక కావేరితో పనేమిటన్నట్లు – ఆ కథని తనపేర పంపించాడు. బహుమతి వచ్చిన తరవాతయినా ఆమెకు ప్రత్యేకత ఇవ్వలేదు. ఏరు దాటిన తరువాత తెప్ప తగులబెట్టే రకం గంగాధరం. ఆ కోపంతోనే ఈసారి కథ రాయి అని వస్తే ససేమిరా రాయను అనుకుంది కావేరి.

అందుకే ఇప్పుడు కథ రాయమని భర్త అడుగుతుంటే "కథలు రాయడంలో మీ అంత తెలివితేటలు నాకెక్కడున్నాయి? నాకేం తెలుసు కథలల్లడం?" అంటూ మూతి మూడు వంకర్లు తిప్పింది కావేరి.

"అమ్మమ్మ! అలా అనకు. ఎవరిలో ఏ కళ దాగి ఉందో... అన్నారు. ఈ ఒక్కసారికి ప్రయత్నించు. చూడు... బహుమతులు రెండువేలు, పదిహేను వందలు, వెయ్యి... కంటి తుడుపు వచ్చినా చాలు – అయిదు వందలు" అంటూ సత్యభామా విధేయుడిని అనుకరిస్తూ భార్యని బ్రతిమిలాడాడు.

"బహుమతి వస్తే నాకేం లాభం? పోయినసారి వచ్చిన డబ్బులో నాకేమి కొనిపెట్టారు?"

సమయం దొరికింది కదా అని ఎత్తిపొడిచింది కావేరి.

"సినిమాకు తీసికెళ్ళాను గదా..." అది చాలదా నీ ముఖానికి అన్నట్టుంది అతని ధోరణి.

"ఆ... తీసుకెళ్ళారు లెండి - బోడి సినిమా. అంతా కలిపి నలభై రూపాయిలు ఖర్చు. అదే మీ ఆఫీసులో ఆడాళ్ళకయితే సినిమాతోబాటు - హోటల్లో పార్టీ ఇచ్చారు. మగాళ్ళకి బారు పార్టీ ఇచ్చారు. అందరూ మిమ్మల్ని మెచ్చుకుంటుంటే మురిసిపోయారు. కష్టం నాదీ, పేరు మీదీనూ..." అక్కసంతా వెళ్ళబోసింది.

"అదా నీ కుళ్లు..." అనబోయి మింగేశాడు.

"ఈసారి బహుమతి అంతా నీకే... ఏం కావాలో చెప్పు" ఏదో ఒక విధంగా పని జరిగితే చాలని అతని ఉద్దేశ్యం.

"పోయినసారి వచ్చిన దాంట్లో సగం ఇవ్వండి. ఈ సారి రాబోయే దానిలో సగం ఇస్తానని రాసివ్వండి" అని బేరం పెట్టింది కావేరి.

ఫ్రెండ్స్ ఉబ్బేసేటప్పటికి పార్టీలిచ్చి డబ్బంతా ఖర్చు పెట్టేసాడు. ఇప్పుడు భార్య ముందు సారి డబ్బులు గురించి అడగగానే ఆగ్రహం అవధులు దాటింది.

"ఎహెపోవే! ఏదో పెద్ద రచయితనను కుంటున్నావు. ఏడుపుగొట్టు మొగమూ నువ్వూనూ... బతిమిలాడే కొద్దీ కొండెక్కుతున్నావు. ఈమాత్రం కథలు నేను రాయలేక కాదు. తిని కూర్చుంటున్న నీ బుఱ్ఱకి పని కల్పిద్దామనుకున్నా" అంటూ గసిరాడు.

బెట్టు చేస్తే కాళ్ళ బేరానికి వస్తాడనుకుంది కావేరి. వ్యవహారం బెడిసి కొట్టగానే ఉడుకు

ఒక్క నిమిషంలో పన్ను పీకినందుకు ఏభైరూపాయలా? డాక్టర్‌ని అడిగాడు పేషెంట్.

మీరు ఇలా ఫీలౌతారని తెలిస్తే ఓ అరగంటపాటు పీకేవాడిని కదా! డాక్టర్ సమాధానం.

వచ్చి ఏడుస్తూ లేచి వెళ్ళిపోయింది.

కథ రాయడానికి ఉపక్రమించిన రెండు గంటల తరువాత, భార్యామణితో సాగించిన సంభాషణలో తనకు కావలసిన సబ్జెక్ట్‌ని వెతుక్కున్న గంగాధరం, బ్రహ్మ రహస్యాన్ని ఛేదించిన జ్ఞానిలా, ఉషారుగా ఈలవేస్తూ, పేపర్లను ఇంక్‌తో నింపి పోస్టుచేసాడు.

తనకు తప్పక ప్రైజు వస్తుందని ధీమగా ఉన్న గంగాధరం తెల్లటి పైజామా - జుబ్బా వేసుకుని - చేతిలో సిగరెట్టుంచుకుని పెద్ద రచయితలా ఫోజులు కొడుతూ తిరగసాగాడు.

రిజల్ట్స్ కోసం ఎదురుచూస్తున్న గంగాధరం చేతిలో పోస్ట్‌మాన్ ఒక కవరుంచి వెళ్ళాడు.

'ఏడుపు గొట్టు కథల పోటీకి మీరు పంపిన కథ ఏడుస్తూ ఉండడం వల్ల, సెలెక్ట్ చేసుకోలేక పోయినందుకు ఏడుస్తున్నాము' అంటూ అందులో ఉన్న ఒక చిన్న కాగితాన్ని చదివి, ఏడవలేక నవ్వాడు గంగాధరం.

కథలు రాయడం అంటే చాలా తేలిక అనే తప్పుడు అభిప్రాయం ఉన్న గంగాధరానికి - అది కూడా ఒక కళ అని - అందరికీ ఆ ప్రావీణ్యం ఉండదనీ తెలిసి వచ్చింది. అతని అహంభావానికి కళ్ళు తిరిగాయి. కళ్ళు కిందికి వాలాయి. ●